

# మూలాల్లోకి..

## 5

కాలువ మల్లయ్య

"చావడు... ఈ ముసలాయన చావడు... చచ్చినా చావడు.. అరరే... ఇదేం విచిత్రం...? చనిపోయినట్టే చేస్తాడు కాని చనిపోడు... కిందికి దింపడం... మళ్ళీ మంచం మీదికి పట్టడం... ఇట్లా ఎంతకాలం? ఇక ఆశలేదు... ఒకటి రెండు రోజులలో చనిపోతాడు... ఊరికి తీసుకెళ్ళండి అని డాక్టర్ చెబితేనే తీసుకొస్తిమి.. ఊళ్లె ప్రాణం పోతే మంచిదని తీసికొస్తిమి... పదిహేను రోజులయినా చచ్చిపోత లేకపోయె... పోనీ బతికినట్టు కాపాయె.. ఈ ముసలాయన ఎప్పుడు పోవాలి? వేం మామూలు పనులెప్పుడు చేసుకోవాలి? ఇంట్లో ఈ పరిస్థితిల మనిషిని పెట్టుకొని ఎట్లా పనులు చేసుకోవడం..."

విసుక్కుంటూ అన్నాడు విశ్వనాథం తమ్ముని కొడుకు రామలింగం... అతడే విశ్వనాథం బాగోగులు చూసుకుంటున్నాడు..

"ఏంటి రామలింగం...! ఇట్లంటున్నవు... ఎనుభయేండ్లు దాటిన పెద్దమనిషి విశ్వనాథం... బహు బతికిండు... కాని ఎందుకో ప్రాణం పోవడం లేదు... ప్రాణం పోయేవరకు ఎదురు చూడటమే మనం చేయాల్సిన పని... ఇలా విసుక్కోవడం బాగాలేదు..." అన్నాడు రాజిరెడ్డి...

"ఏం చేయ్యమంటరు పటేలా...? మాదేమో వ్యవసాయ కుటుంబమాయె... మా పెదబాపును ఎంత మంచిగ చూసుకున్ననో మీకు తెలువదా? నెల రోజుల్నుంచి దవాఖానల వెంట తిరుగుడు... ఇదే పనాయె... పైసలు వాళ్ళయే అనుకోండ్రి... కాని ఏం ఫలితం లేకపాయెనని బాధ... పదిహేను రోజుల్నుంచి అటు బతికినట్టు కాపాయె... ఇటు చనిపోయినట్టు కాపాయె..." అన్నాడు రామలింగం..

"ఏపోండ్రి... ఏం మాట్లాడుతరు...? ఏవో తీరని కోర్కెలుంటే ఎవ్వలేం చేసినా ప్రాణం పోదు.. ఇట్లనే కొట్టుకుంటది.? నేనెన్ని చావులు చూల్లేదు..." అన్నాడు వెంకట్రావు.

"విశ్వనాథంకే తీరని కోర్కెలున్నాయి...? పండుటాకు వయసు వచ్చేవరకు బతికిండు- ఒక్కడే కొడుకు, ఒక్కతే బిడ్డ. వాళ్ళిద్దరూ కుటుంబాలతోని అమెరికాల ఉంటున్నరు... రెండు చేతులా సంపాయిస్తున్నరు... విశ్వనాథంకు కూడా చదువొచ్చు కాబట్టి కొడుకును బాగా చదివించాడు... బాగా చదువుకున్నోన్ని చూసి బిడ్డనిచ్చాడు... వాళ్ళంతా అమెరికాకుపోయిరి... ఇక్కడుండేది ఒక్కడేనాయె... అందుకే తమ్ముని కొడుకు దగ్గరుంటున్నడు..." అన్నాడు రాజవీరు..

"అది నిజమేకాని పెద్దమనిషి విచిత్రమే చేస్తున్నడు. ప్రాణం పోయినట్టే చేస్తడు... మల్ల లేచి కూచుంటడు.. మల్ల కోమాలోకి పోయినట్టు పోతడు... ఏం దన్నట్టుగిది... బతికుండి అందరి మేలే కోరాదు కాని చచ్చుకుంట అందరి గోస పుచ్చుకోవట్టె..." అన్నాడు సర్పంచ్...

అక్కడున్న వాళ్ళందరూ తలో రకంగా మాట్లాడుతున్నారు... "అట్లాగుండ్రి... ఏం మాట్లాడుతరు... వాన రాకడ, పానం పోకడ ఎవ్వలకు తెలువదంటరు.. చావాలె చావాలె అంటె ఎట్ల సత్తదు.. చావు రావద్దా... ఆ సమయం రావద్దా...?

"భలేటోనివి రాజేందర్... విశ్వనాథం చావాలని ఎవ్వలు కోరుకుంటున్నరు...? సమయం రాందే చావురాదని మాకు తెలువదా...? కాని అటు బతికినట్టు కాపాయె... ఇటు చచ్చినట్టు కాపాయెనని బాధ..." అన్నాడు వెంకటేశం...

"అమెరికానుంచి కొడుకు కోడలచ్చె... బిడ్డ అల్లుడచ్చిరి... ఇంకేంగావాలె... అందరచ్చినట్టు ఎరికేనాయె మా పెదనాయిన్నకు... ఇంక దేనికోసం చూస్తున్నడు..." అన్నాడు రామలింగం.

"విశ్వనాథం కావాలని చేస్తున్నడంటరా ఏంది...? చావు రాకుంటే ఎవ్వలేం జేత్తరు...?

"విశ్వనాథం మొండిఘటం... ఏదో కోర్కున్నది.. అది తీరెదాక పానం బోదు..."

"అందరు రానే వచ్చిరి... ఇంకేంది వయా...?"

"ముసలాయన చనిపోతెకర్మ చేసి అమెరికాకు చెంగోబిల్ల అందామని చూస్తున్నరు బిడ్డా, కొడుకు... ఆ యింతొక్కడువోతే వాళ్ళిటు ఎందుకస్తరు...?"

సర్పంచ్ మాటలు విని ముఖం మాడ్చుకున్నారు మహేందర్, సత్యవతి... తండ్రినా స్థితిలో చూస్తూ సర్పంచ్‌ను ఏమనడానికి నోరు రావడం లేదు... మౌనంగా ఉన్నారు...

"దూరంగా ఉన్నా తండ్రిని బాగానే చూసుకున్నాడు మహేందర్... ఒక్క ముసలాయన కొరకు అక్కడన్నీ వదిలిపెట్టి ఇక్కడచ్చి ఉండమంటావా సర్పంచ్ సాబ్..." అన్నాడు రాజవీరు...

"అని ఎవ్వలన్లేదు కాని తన వాళ్ళకోసం జీవితమంతా తపిస్తూనే ఉన్నాడు విశ్వనాథం...

## చెదిరిన లక్ష్మణరేఖలు

### అడిగోపుల వెంకటరత్నమ్

జీవితం నడుస్తూ వుంది
బతుకును మోస్తూ వుంది
నడకను కొలిచిన మైలురాళ్ళు
కూడికలు తీసివేతలు చేస్తున్నాయి
ఋతువుల గతులు మారాయి
వర్షాకాలంలో గ్రీష్మతాపం
చలికాలంలో సునామీలు!
ఇప్పుడు అందరూ మేల్కొనే వున్నారు
ప్రయాణానికి సన్నద్ధులౌతున్నారు
గమ్యం వొక్కటే దారులు వేరు
ప్రయాణ సాధనాలు వేరు
పల్లకీలకు నగిషీలు చెక్కబడుతున్నాయి
అంబారీలు కట్టబడుతున్నాయి
శకటాలు ఇంధనం నింపుకొంటున్నాయి
నేల అంటని కాళ్ళు గాల్లో తేలాడుతున్నాయి!
ఒకదారి కారడవి
ఒకదారి వైతరణి
ఒకదారి జలనిలయం
ఒకదారి సర్పమయం
ఒకదారి పూలపాన్పు
మనుషుల వేషం మారింది
చేతులు మారాయి
అన్నిబాటల్ని జయించారు
పూలబాటలో పరాజయం
మన్మథుడు బాణాలు సంధిస్తున్నాడు
రతీదేవి నృత్యకేళిలో లీనమైంది
మనుషులు మజిలీలోకి జారుతున్నారు
విలువలు వ్యాపారపరమయ్యాయి
లక్ష్మణరేఖలు చెదురుతున్నాయి
రీతి దాటిన మనుషుల్లో నీతి నిలవదు!
ప్రభువును పట్టమహిషిని
మొలక ప్రాయాన్ని పడుచుదనాన్ని
తుల్యంగా తూస్తుంది ఎయిడ్స్
పాడెను మోస్తూ శవాలను వెతుకుతూ వుంది
మృత్యువు దంష్ట్రకు చిక్కిన మనిషికి
అనురక్తి అనునయం
ఆత్మీయతా సాంత్వనం అవశ్యం!
వర్తమానాన్ని దాటిన పాదం
ఎయిడ్స్‌లోకి పరుగులు
మరణమని తెలిసీ మార్గం తప్పటంలో
నొసటి రాతంటూ బ్రహ్మకు ఆపాదించవద్దు
బాగుపడ్డా భంగపడ్డా
బతుకు నీ చేతిలో వుంది
కబళించే మృత్యుకు కాచుకు కూర్చొని వుంది!

'రాజమ్మ' కొడుకు దగ్గరకు పోయి అమెరికాలుండె... అక్కన్నే చనిపోయే... దేశమని, పల్లెటూరని, తన ఊరని విశ్వనాథం ఒక్కడే ఇక్కడుండె... ఉపాధ్యాయుడిగా రిటరైనంక గూడ బిడ్డ, కొడుకు రమ్మంటే పోకపాయే... పిలువంగ పిలువంగ ఒక్కసారి పోయి వచ్చిండేమో...? తిండికి, దేనికి కొదువలేదు కాని ఒంటరి బతుకయిందిక్కడ..."

"ఏం ఒంటరి బతుకు... రామలింగం తన తండ్రికంటె ఎక్కువే చూసుకున్నడు గదా రాజిరెడ్డి..." అన్నాడు సర్పంచ్

"అవునవును..." అన్నారు కొందరు

"అగో...కదుల్తలేదు.. మెదుల్తలేదు... పెద్దమనిషి చనిపోయినట్టున్నడు... కిందికి దింపుండ్రి..." అన్నాడు మచ్చయ్య.

వాకిట్లో గడ్డి పరిచి దానిపై వేశారు విశ్వనాథంను. పై నుండి దుప్పటి కప్పారు..

బంధువులు ఏడ్వడం మొదలుపెట్టారు..

"ఆగుండ్రి.. పదిహేను రోజులునుంచి గదే కథాయె... చనిపోయిన తర్వాత ఏడువొచ్చు కాని ఆగుండ్రి..." అన్నాడు పోలీసు పటేలు..

వాళ్ళంతా ఏడుపాపారు...

నాడిపట్టి చూశాడో పెద్దమనిషి.

"నాడి కొట్టుకుంటుంది... ఇంకా ప్రాణం పోలేదు..."

"ఎంతయినా చివరిదశే.. జీగంజిపోయిండ్రి" అన్నాడు వెంకట్రెడ్డి....

గ్లాసులో నీళ్ళు తెచ్చింది రామలింగం భార్య... ఓచెంచా అందులో వేసింది.


"వట్టి నీళ్ళేం పోస్తరు...? అందులో తులిసాకు వెయ్యుండ్రి..." తులిసాకులు తెంపుకొచ్చి అందులో వేసారు...

చెంచాతో విశ్వనాథం గొంతులో నీళ్ళు పోస్తున్నారు.

కొడుకు మహేందర్, అతని భార్య, కూతురు సత్యవతి ఆమె భర్త కూడా జీగంజి పోశారు...

"నాన్నా...! నేనొచ్చిన... నేను... నీ కొడుకు మహేందర్‌ను..." అని చెవిలో నోరుపెట్టి అరిచాడు మహేందర్...

గంట గడిచింది... రెండు గంటలు గడిచాయి... సాయంత్రమయింది... అదే స్థితిలో మరో రోజు గడచింది... అయినా విశ్వనాథం ప్రాణం



కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

ఎన్.వి. రమణమూర్తి, విజయవాడ.

పోవడం లేదు.. స్వయంగా డాక్టరైన మహేందర్‌కే తండ్రి స్థితి అర్థం కావడం లేదు.

"అరే... ఎంతకాలం చూడటం...?"

"అయితే చావకముందే పారేస్తరా ఏంది...?"

కుడి చేతి వేళ్ళను అటూ ఇటూ కదిలించడం, ఏదో మాట్లాడటానికి ప్రయత్నించినట్టు పెదవులు కదపడం గమనించారు వాళ్ళు..

"మెుండి ప్రాణం... దేనికోసమో కొట్టుకుంటుంది..."

"ఏవైనా తీరని కోర్కెలుంటే ఇలాగే అవుతుంది... తీరుతుందని హామీ దొరికేవరకు ప్రాణం పోదు..."

"ఆయనకేం కోర్కెలున్నాయి..?

"ఎందుకుండవు..."

"రాజిరెడ్డీ... నువ్వు విశ్వనాథం ప్రాణ స్నేహితుడివి.. నీతో ఏమైనా చెప్పాడా విశ్వనాథం...! మరెందుకు ప్రాణం పోవడం లేదు... నీకు తప్ప అతన్ని గురించి మరెవ్వరికీ తెలియదు పూర్తిగా..." అన్నాడు మచ్చయ్య...

"అవునవును... రాజిరెడ్డే చెప్పాలి..." అన్నారు కొందరు.

రాజిరెడ్డి ముందుకు వచ్చాడు.

"అతనికో బలమైన కోర్కె వుంది.. అది తీరేది కాదు.. "అన్నాడు.

"తీరుతుందో లేదో తర్వాత కాని అదేంటో చెప్పు..."

"తన పిల్లలు ముఖ్యంగా కొడుకు అమెరికాకు పోవడం విశ్వనాథంకు ఇష్టంలేదు... పోయినా అక్కన్నే స్థిరపడడం అసలే ఇష్టం లేదు... తన వాళ్ళకు దూరంగా ఉండటం విశ్వనాథం భరించలేకపోయాడు... జీవితమంతా అదే వేదననుభవించాడు..." అన్నాడు రాజిరెడ్డి..

ఆ మాటలకందరూ ఆశ్చర్యపోయారు...

"విశ్వనాథం కొడుకు పోయిన కాలం సంగతివేరు... ఇప్పుడయితే అందరు పోతున్నారు గదా.. అమెరికా"

"దూరంగా ఉన్నా విశ్వనాథం పిల్లలు అతన్ని బాగానే చూసుకున్నారు. అప్పుడెప్పుడో అమెరికాకు పోయిన మహేందర్‌ను ఇక్కడొచ్చి ఉండమంటే ఉంటాడా...?"

"ఉండకపోవచ్చు... కాని ఈ దేశంలో పుట్టి బాగా చదువుకున్న రత్నాల్లాంటి యువకులు విదేశాల్లో స్థిరపడటం విశ్వనాథంకు ఇష్టంలేదు.. దేశంలో బ్రెయిన్, డ్రెయిన్ అవుతుందని ఆవేదన పడేవాడు..." అన్నాడు రాజిరెడ్డి.

"అవన్నీ సరేకాని ఇంతకీ విశ్వనాథంకు ఏం కావాలట...? చెప్పు రాజిరెడ్డి..." అన్నాడు సర్పంచ్...

విశ్వనాథంకు ఏం కావాలో చెప్పాడు రాజిరెడ్డి. అందరూ ఆశ్చర్యచకితులయ్యారు...

"ఈ మాట నీకు చెప్పాడా...?" అన్నాడు పోలీసు పటేలు

"ఒక్కసారి కాదు... అనేకసార్లు..."

"మా నాన్న నాతోనూ చెప్పాడు..." అన్నాడు మహేందర్.

సత్యవతి అదే మాటంది...

"మహేందర్... నువ్వు మీ నాన్న కోర్కె తీర్చగలవా...?" అన్నాడు సర్పంచ్ మహేందర్‌ను చూస్తూ...

"నేనక్కన్నే స్థిరపడ్డాను కదా... ఇక్కడ కొచ్చి శాశ్వతంగా ఉండటం సాధ్యమవుతుందా..?" అన్నాడు మహేందర్...

"మరి అమెరికాకు పోయేప్పుడు మీ నాన్నతో ఏమన్నావు... ఈ దేశం తిరిగొస్తానన్నావు కదా...!"

"ముప్పయేళ్ళ క్రితం.. అప్పుడేదో అన్నాను. అదీ నాన్న తిరిగి రావాలంటే సరే అన్నాను... ఆ మాటకోసం ఇక్కడికొచ్చి ఉండటం ఎలా సాధ్యం...?"

తన అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పాడు మహేందర్.. "మహేందర్ ఇచ్చిన మాటెలా ఉన్నా ఇప్పుడు చూడాల్సింది విశ్వనాథం చావుగురించి... మాట నెరవేర్చినా, నెరవేర్చకున్నా మహేందర్ తండ్రి కోర్కె తీరుస్తానని విశ్వనాథం చెవుల్లో గట్టిగా చెబితే తృప్తిగా చనిపోతాడు..." అన్నాడు వెంకట్రావు.

"అవునవును.. తర్వాత ముసలాయన చూడొస్తాడా...? కనీసం చావయినా తృప్తిగా రానీ... మహేందర్ మీ నాన్న చెవిలో గట్టిగా అను... ధ్వని ఆయనకు చేరేట్టు..." అన్నాడు సర్పంచ్...

అందరూ అదే మాటన్నారు....

తండ్రి మీదికి వంగాడు మహేందర్.. చెవి దగ్గర నోరు పెట్టాడు. "నాన్నా...! నేను ఈ దేశానికి తిరిగివస్తాను.. నా జ్ఞానాన్ని, ధనాన్ని ఇక్కడే వినియోగిస్తాను... నీ కోర్కె తీరుస్తాను..." అన్నాడు గట్టిగా

తర్వాత చంచాతో జీగంజి పోశాడు...

బిడ్డ అదేపని చేసింది.

అయినా విశ్వనాథం స్థితిలో ఏమార్పులేదు...

"ఇదేం విచిత్రం.. ఇది ఏ గొప్ప వైద్యునికీ అందని విషయం.. కాదంటావా మహేందర్..."

"కావచ్చు... కాని మహేందర్ అబద్ధమాడుతున్నాడని విశ్వనాథంకు తెలుసు... అతనికి తన దేశమంటే, గ్రామమంటే, తన వాళ్ళంటే ఎంత ప్రేమో, అతడు తన పిల్లల కొరకెంత తపించాడో, అతడు తన మూలాలనెలా ప్రేమించేవాడో తెలియాలంటే కొన్ని విషయాలు చెబుతాను వినండి... తర్వాత ఏం చేద్దామో ఆలోచిద్దాం... అన్నాడు రాజిరెడ్డి

★ ★ ★

"మహేందర్‌ను ఇంగ్లీషు మీడియం పాఠశాలలో వేద్దాం..." రాజమ్మ మాటలకు షాక్ తగిలినట్టయింది విశ్వనాథంకు...

"ఎందుకోయ్ ఇంగ్లీషు మీడియం... తెలుగు మాధ్యమ పాఠశాలలు బాగానే ఉన్నాయి కదా..." అన్నాడు...

"ఇప్పుడిప్పుడే ఇంగ్లీషు మాధ్యమాల జోరు పెరుగుతుంది... భవిష్యత్తులో అన్నీ అవే అవుతాయి... మీరు ఉపాధ్యాయులు.. ఖర్చు మనం భరించగలం.. ఇంగ్లీషు మీడియంలో వేయడానికేంది...."

"దానివల్ల వచ్చేదేంటోయ్... మాతృభాష మాధ్యమంలో చదువు వల్ల సర్వతోముఖ వికాసం కలుగుతుంది... పరాయి భాషా మాధ్యమం వల్ల బట్టీకి అలవాటు పడుతారు... ఉన్నది ఒక్క బాబు.. మనతోనే ఉంచుకొని చదివిద్దాం..."

"మనతోనే ఉంచుకుందాం... కాని తెలుగు మీడియం వద్దు... మీకెలాగు కరీంనగర్‌లోనే ఉద్యోగం కదా...! సెయింట్ జాన్ స్కూల్లో వేద్దాం..."

"పరాయి మాధ్యమంలో చదువు వల్ల పరాయీకరణకు గురవుతారు పిల్లలు.. మనకు కాకుండా పోవచ్చు..."

"మీదంతా చాదస్తం... వాడు బాగా చదువుకొని ఏ డాక్టరో ఇంజనీయరో అయితే చాలదా... తెలుగులో చదువుకొని మీలాగా బడిపంతులు కావాలంటారా..." అంది రాజమ్మ

రాజిరెడ్డి అక్కడే ఉన్నాడు...

భార్యాభర్తల మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి... ఎవరి వాదం వారిదే...

"విశ్వనాథం... నీది ఆదర్శం... ఆశయం... కాని అవే జీవితం కావు... వసతుండే ఇంగ్లీషు మీడియంలో ఎందుకు వేయవు..." అన్నాడు రాజిరెడ్డి.

ఇక ఒప్పుకోక తప్పలేదు విశ్వనాథంకు... రాజమ్మ చెప్పినట్టుగానే క్రమక్రమంగా ఇంగ్లీషు మాధ్యమాలు పెరిగాయి... ఎక్కువమంది అందులోనే చదివిస్తున్నారు.. మహేందర్ చదువు పూర్తి చేశాడు... డాక్టరయ్యాడు..

ఓ రోజు విశ్వనాథం ఇంట్లో కూర్చున్నారందరూ... రాజిరెడ్డి అక్కడే వున్నాడు...

"నాన్నా...! నేను అమెరికాకు పోతాను..."

ఉపోద్ఘాతమేం లేకుండానే అన్నాడు మహేందర్ పైన పిడుగు పడ్డట్టనిపించింది విశ్వనాథంకు..

"ఎందుకు...? చూసి రావడానికా...? చదువు కోసమా...." అన్నాడు...

"కాదు... ఉద్యోగం కోసం..." అన్నాడు మహేందర్...

"డాక్టర్లకు ఇక్కడేం తక్కువయిందని..."

"అక్కడయితే డాక్టరుగా బాగా సంపాదించవచ్చని. ఇక్కడేం పాడయింది...?"

"అంటే...? పోయక్కడే ఉంటావా?"

"ఉండాలనే నా అభిప్రాయం..."

"దీంతో నువ్వు పొందేదేంటి...."

"మంచి జీతం... మంచి జీవితం... ఉన్నతమైన బతుకు..."

"ఇలా బ్రెయిన్ డ్రెయిన్ జరుగుతుంటే దేశం ఏం కావాలి...?"

"నాన్నా...! అవన్నీ నాకు నచ్చవు... ఎవరి బతుకు వారిది..."

"మనదేశంలో పల్లెల్లో డాక్టర్ల అవసరం చాలా ఉంది... వైద్యసౌకర్యం లేక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు... ఇవేవీ పట్టించుకోకుండా స్వసుఖాల నాశించి దేశం వదిలిపోవడం బాగుందా మహేందర్..."

"అవన్నీ ఆలోచిస్తే సుఖముండదు నాన్నా..."

"అమెరికాకు వెళ్ళితే నువ్వు మనవాళ్ళకు ఏవిధంగానూ ఉపయోగపడవు... మన పల్లెలకూ ఉపయోగపడవు..."

"కావచ్చు... కాని నాకు డబ్బే కావాలి..."

"డబ్బే ముఖ్యమా...?"

"అవును... నాకదే కావాలి..."

"పోక తప్పదంటావా?"

"తప్పదు..."

"అయితే ఒక్క షరతు..."

"చెప్పండి నాన్నా.."

"బాగా సంపాదించుకొని తిరిగి రావాలి... నువ్వు సంపాదించిన జ్ఞానాన్ని, ధనాన్ని నీ దేశంలో, నీ వాళ్ళకుపయోగించాలి..."

తండ్రితో వాదమెందుకని

"అప్పటివరకు చూద్దాంలే..." అన్నాడు మహేందర్..

ఒప్పుకోక తప్పలేదు విశ్వనాథంకు.. అమెరికా వెళ్ళాడు మహేందర్.. నాలుగేళ్ళ తర్వాత వచ్చి పెళ్ళిచేసుకొని భార్యతో పాటు వెళ్ళాడు... తండ్రికిచ్చిన మాటను మరిచిపోయాడు... అప్పుడప్పుడు డబ్బు పంపుతూ తన బాధ్యత నెరవేర్చుతున్నాననుకున్నాడు... అక్కడే పిల్లల్నికన్నాడు... అక్కడే స్థిరపడ్డాడు... ఏ ఏడెనిమిదేళ్ళ కొక్కసారో వచ్చిపోతున్నాడు...

ముందు ఉత్తరాల్లో తర్వాత ఫోన్లో, ఆ తర్వాత ఇంటర్‌నెట్లో తప్ప కొడుకును చూసుకున్నది లేదు...

"ఏం చేయాలి రాజిరెడ్డీ... కొడుకు, బిడ్డ అమెరికాలో... వాళ్ళను చూసుకునేది ఫోటోల్లోనే.. వాళ్ళ మాటలు




కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

ఎన్.వి. రమణమూర్తి, విజయవాడ.

వినేది ఫోన్లోనే... ఇపుడు ఇంటర్‌నెట్‌లో ఫోటో చూస్తూ మాటలు వింటున్నాను..” అన్నాడు విశ్వనాథం

“అవును విశ్వనాథం.. ఇప్పుడు మరీ పెరిగింది అమెరికాకు పోవడం... పిల్లలను, వాళ్ల పిల్లలను ఫోటోల్లో మాత్రమే చూస్తున్నాం... కాకుంటే ఇంటర్‌నెట్‌లో.. క్యాసెట్ల ద్వారా మాత్రమే మాటలు వింటున్నాం..” అన్నాడు రాజిరెడ్డి..

ఓ రోజు ఇంటర్‌నెట్ ముందు కూర్చున్నాడు విశ్వనాథం

“ఏం చేస్తున్నావు నాన్నా... మహేందర్...” అన్నాడు...

“ఇంట్లోనే ఉన్నాను... పిల్లలున్నారు... స్క్రీన్‌పై మేం కనబడుతున్నాం కదా నాన్నా...! ఇంకేం కావాలి...?”

“మా గతి ఇంతేనా బాబూ... మిమ్ములను చూసుకోవడం, మీతో గడపడం సాధ్యం కాదా... వీటితోనే సంతృప్తి పడాలా?” అని గొడగొడా ఏడుస్తున్నాడు విశ్వనాథం

“నాన్నా...! మీరెంత పిచ్చివాళ్ళు... రమ్మంటే ఇక్కడికి రారు.. అక్కడికొచ్చి మేమెన్ని రోజులుండగలం...? మేమిక్కడ హాయిగా ఉంటే మీరెందుకేడ్వటం...? ఊర్కోండి...” ఓదార్చాడు మహేందర్...

“నేను మిమ్మల్ని ఇలా మాత్రమే చూసుకోవడమా...?”

“మీ కొడుకు, మనవడు అమెరికాలో ఉన్నారంటే అదో హోదా కదా నాన్నా... బాధపడటం ఎందుకు..?” అన్నాడు మహేందర్..

మరికొద్దిసేపు మాట్లాడి పెట్టేసాడు...

“నాకిచ్చిన మాటను మరిచిపోయాడు మహేందర్... వాడిక్కడికి రాడు... వచ్చినా కొద్దిరోజులే... వాడే రాకుంటే వాని పిల్లలెలా వస్తారు..? నా రక్త సంబంధీకులను ఫోటోలలో టి.వి. తెరపై చూసుకోవడమేనా రాజిరెడ్డీ నాదే కాదు.. చాలా మంది బతుకులింతే అయ్యాయి... నా కోర్కె తీరకుండానే నేను చనిపోతానా మిత్రమా..?”

ఏడుస్తూ అన్నాడు విశ్వనాథం

మిత్రున్ని ఓదార్చాడు రాజిరెడ్డి

“రోజు రోజుకూ బ్రెయిన్ డ్రెయిన్ పెరుగుతుంది రాజిరెడ్డీ.. నా లాంటి అనాథల సంఖ్య మరీ పెరుగుతుంది... బ్రెయిన్ డ్రెయిన్‌ను ప్రోత్సహించడం ఏం బాగుంది రాజిరెడ్డీ.. నాకైతే ఇదేం నచ్చడం లేదు... ఇంతకీ నా కోర్కె తీరుతుందా? లేదా? నా కోర్కె తీరేవరకు నేను చావను గాక చావను...”

అన్నాడు విశ్వనాథం

* * *

“ఇదీ విశ్వనాథం కథ... అందుకే ముసలాయన ప్రాణం పోవడం లేదు... తన కోరిక తీరుతుందన్న ఆశతో కొట్టుమిట్టాడుతుంది... మనమేం చేసినా ప్రాణం పోయేట్టు లేదు...” అన్నాడు రాజిరెడ్డి...

అందరూ తలలు పట్టుకున్నారు..

ఏం చేయాలో తోచడం లేదు...

“మహేందర్...! ఏం చేస్తాం...?” అన్నాడు సర్పంచ్..

“నాకు మాత్రమేం తెలుసు...? మీరే చెప్పండి...” అన్నాడు మహేందర్..

“ఏం చేద్దాం మరి... చెప్పండి...” అన్నాడు వెంకట్రావు..

“ఏముంది తీసుకెళ్దాం...” అన్నాడు రామలింగం...

“వద్దు... ప్రాణం పోయేవరకు ఆగవలసిందే...”

రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు వాళ్ళు పొద్దుగూట్లో పడబోతోంది..

ఎందరు జీగంజి పోసినా విశ్వనాథం ప్రాణం పోవడంలేదు..

ఏం చేయాలో తోచక అందరూ తలలు పట్టుకున్నారు...

ఇంతలో బజార్లో కారాగింది...

అందులోంచి విశ్వనాథం మనుమడు ‘విరాట్’ దిగాడు.... అందరూ ఆశ్చర్యంతో నోళ్లు తెరిచి అటుదిక్కే చూస్తున్నారు...

విరాట్ నడుచుకుంటూ తాత దగ్గరికెళ్ళాడు.. గ్లాస్ చేతిలోకి తీసుకున్నాడు.. చెంచాతో రెండు చెంచాల నీళ్లు తాత గొంతులో పోశాడు...

తాత చెవి దగ్గర నోరు పెట్టాడు...

“తాతయ్యా..! నేను వచ్చాను... నీ మనుమన్ని... అమెరికా నుంచి వచ్చాను... మళ్ళీ పోవడానికి కాదు... ఇక్కడే పుండటానికి వచ్చాను... నా మూలాల్లోకి తొంగి చూస్తాను... నా వాళ్లకు అండగా ఉంటాను... నా పాలివాళ్ల బాగోగులు చూస్తాను. నా చదువును, జ్ఞానాన్ని, ధనాన్ని, సేవలను నా దేశానికి ఉపయోగపడేలా చూస్తాను.. నేనిదివరకు వచ్చినప్పుడే నీ అభిప్రాయాలు తెలుసుకున్నాను.. నీ ఆశయాలను, ఆదర్శాలను నేను పూర్తి చేస్తాను.. ఈ దేశంలో మన వంశాన్ని నేను నిలబెడతాను...” అని గట్టిగా చెప్పాడు ‘విరాట్’

అంతే.. రకీమని లేచాడు విశ్వనాథం... తాత వీపుకింద చెయ్యేసి పట్టుకున్నాడు విరాట్. బలవంతంగా కళ్ళు తెరిచాడు విశ్వనాథం.. మనుమన్ని చూశాడు.. అతికష్టంగా చేతిని కదిపి అతని తలపై వేశాడు... అతని కళ్లవెంట పటపటా నీళ్ళు కారాయి.. బలవంతంగా రెండు చేతులు దగ్గరకు తెచ్చి వెనక్కి పడిపోయాడు తృప్తిగా కళ్ళు మూసాడు... అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.. అక్కడున్న వాళ్ళంతా గొల్లుమన్నారు.. వాళ్ళ ఏడుపులు సముద్రాలు దాటి విదేశాల్లో ఉన్న తెలుగువారి చెవుల్లోనూ ప్రతిధ్వనిస్తున్నాయి.. కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నాయి.. మేధోవలసలను ఆపమని హెచ్చరిస్తున్నాయి... ‘మనిషి’ మూలాలను మరిచిపోవద్దనీ గుర్తు చేస్తున్నాయి..

